

క్షణక్షణం.. భయం భయం
రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మించిన పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి.
- 9లో



డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి
వచ్చే విద్యాసంవత్సరం నాటికి మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
- 9లో



బుద్ధవనంతో దివ్యానుభూతి..
బుద్ధవనం బౌద్ధులకు దివ్యానుభూతిని కలిగిస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజి కమలేష్ పటేల్ పేర్కొన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నేత్రపరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయం, ముఖ మండపం, ప్రాకార మండపాల్లో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

వినాయక మండపాల్లో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు



ఆత్మకూరు(ఎం)లోని వినాయకుడి మండపంలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

ఆత్మకూరు(ఎం) : వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆత్మకూరు(ఎం), సింగారం, కొరటికల్, పల్లెర్ల తదితర గ్రామాల్లో శుక్రవారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీసీపీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది లక్ష్మణ్, విద్యాసాగర్ తెలిపారు.

అధిక సాంద్రత పత్తి చేల పరిశీలన



పత్తి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మోత్కూరు : మండలంలోని బుజిలాపురంలో రైతులు బ్రహ్మాచారి, చాతరాశి వెంకన్న సాగు చేస్తున్న అధిక సాంద్రత కలిగిన పత్తి చేలను శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.అనిల్‌కుమార్, కె.మమత పరిశీలించారు. సాగువిధానం, సస్యరక్షణ చర్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పత్తి సాగు విధానంలో సమయానుకూలంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను లాభాలను వివరించారు.

మహిళా ఓటర్లే అధికం

పురుషులకన్నా 1,960 మంది ఎక్కువ

- గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల
- మొత్తం ఓటర్లు 5,20,297 మంది
- నేటినుంచి అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా వెల్లడి



గుండాల మండలం గంగాపురం పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న సిబ్బంది



సాక్షి, యాదాద్రి : జిల్లాలో మహిళా ఓటర్లే ఆధిక్యం. మొత్తం 5,20,297 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,59,167 ఉండగా, మహిళలు 2,61,127, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పంచాయతీ ఓటర్ల జాబితా ముసాయిదాను శుక్రవారం ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే విడుదల చేశారు. పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా, మండల పరిషత్ కార్యాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు.

426 పంచాయతీల జాబితా విడుదల

నూతనంగా ఏర్పడిన పంచాయతీలతో కలిపి జిల్లాలో 428 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందు రెండు పంచాయతీలు మినహా మిగతా 426 పంచాయతీలకు సంబంధించి ఓటరు జాబితా ముసాయిదాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. నూతనంగా ఏర్పడిన ఇందిరానగర్, గుర్జవానికుంట జాబితాలు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. ఒకటి,రెండు రోజుల్లో వాటిని కూడా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వినతిపత్రాలు స్వీకరించనున్నారు. ఇందుకోసం సిబ్బందిని ప్రత్యేకంగా అందుబాటులో ఉంచనున్నారు.

పంచాయతీలు, ఓటర్లు ఇలా..

గ్రామ పంచాయతీలు	428
జాబితా విడుదలైనవి	426
మొత్తం ఓటర్లు	5,20,297
పురుషులు	2,59,167
మహిళలు	2,61,127
ఇతరులు	03

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేశాం. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో వార్డుల వారీగా జాబితాలను ప్రదర్శించాం. జాబితాపై ప్రజలకు, రాజకీయ పార్టీలకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా అధికారులకు తెలియజేయాలి. వాటిని డీపీఓ పరిశీలించి పరిష్కరిస్తారు. ఈనెల 18న జిల్లా స్థాయిలో, 19వ తేదీన మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా జాబితాపై చర్చిస్తాం. వారి సూచనలు, సలహాలు తీసుకుంటాం. 28న తుది జాబితా విడుదల చేస్తాం.

–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

18,19 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించి 26న పరిష్కారం చూపుతారు. తుది జాబితాను ఈనెల 28న వెల్లడిస్తారు. ఇదిలా ఉండగా ముసాయిదా జాబితాపై ఈనెల 18న జిల్లాస్థాయిలో జిల్లా ఎన్నికల అథారిటీ, 19న మండల స్థాయిలో ఎంపీడీఓ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు.

● విజయోత్సాహం



నల్లగొండ - రంగారెడ్డి పాల్ప ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి లిమిటెడ్ మదర్ డెయిరీ ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి తదితరులు

తుపాను నష్టం రూ.86.60 లక్షలు

- బాధితులకు నష్ట పరిహారం మంజూరు

సాక్షి, యాదాద్రి : ఆగస్టు 30నుంచి ఈనెల 2వ తేదీ వరకు కురిసిన వర్షాలకు జిల్లాలో రూ.86.60 లక్షల మేర నష్టం వాటిల్లిందని, బాధితులకు నష్టపరిహారం డబ్బులు కూడా మంజూరైనట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్డగూడురు మండలంలో మృతి చెందిన వృద్ధురాలి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, భువనగిరి మండలంలో పాడిపశువులు మృతి చెందగా రూ.50వేలు, పూర్తిగా కూలిన ఇంటికి రూ.1.30 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న 59 ఇళ్లకు రూ.3.83 లక్షలు మంజూరయ్యాయి. కల్వర్టుల మరమ్మతులకు రూ.27.66 లక్షలు, పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.9.48 లక్షలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రూ.25.70 లక్షలు, పాఠశాలల ప్రహరీలు, ఇతర మరమ్మతులకు రూ.11.15 లక్షలు, కుంట మరమ్మతులకు రూ.1.98 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. బాధితులకు పరిహారం చెల్లించడంతో పాటు వివిధ అవసరాల నిమిత్తం జిల్లాకు ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసిందన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయండి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌కు సభ్యత్వం అందజేస్తున్న బంగారు శృతి

వలిగొండ :రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఇప్పటినుంచి కష్టపడి పని చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి కోరారు. శుక్రవారం వలిగొండలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌కు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కంటే సభ్యత్వాలు పెంచాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రభారీ చాడ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, రాచకొండ కృష్ణ, ఏలే చంద్రశేఖర్, సీఎస్ రెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, చందా మహేందర్‌గుప్తా, ఊట్కూరు అశోక్‌గౌడ్, రంగారెడ్డి, బోళ్ల సుదర్శన్, రేగూరి అమరేందర్, కీర్తి వెంకటేశం పాల్గొన్నారు.

102 వాహనం.. జర పైలం



మోత్కూరు : గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లి, కాన్పు అనంతరం క్షేమంగా ఇంటికి చేర్చేందుకు ప్రవేశపెట్టిన '102' సేవలు అగమ్యగోచరంగా మారాయి. వాహనాలు కండీషన్ లేకపోవడంతో తరచూ మొరాయించడం, ప్రమాదాలకు గురవుతున్నాయి. శుక్రవారం గర్భిణిని తీసుకురావడానికి మోత్కూరు ఆస్పత్రి నుంచి ఆత్మకూర్(ఎం) బయలుదేరిన 102 వాహనం.. రాజన్నగూడెం సమీపంలోకి రాగానే బ్యాలెన్స్ రాడ్డు విరిగి పక్కకు ఒరిగింది. ఈ సమయంలో వాహనంలో పేషెంట్లు లేకపోవడంతో ముప్పు తప్పింది.

30 నుంచి డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షలు

నల్లగొండ రూరల్: ఈనెల 30వ తేదీ నుంచి డిగ్రీ 6వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 23లోపు సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఒక్క సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక్క సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్షిక ఆదాయ లక్ష్యం రూ.448 కోట్లు

- మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ శ్రీనివాస్

చౌటుప్పల్ : వరంగల్ రీజినల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్లకు 2024–25 సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ లక్ష్యాన్ని రూ.448 కోట్లుగా నిర్ణయించామని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల అధికారులు, కార్యదర్శులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది వార్షిక ఆదాయ లక్ష్యం రూ.438 కోట్లు కాగా దాన్ని అధిగమించినట్లు తెలిపారు. మార్కెట్లకు ప్రధానంగా లావాదేవీలు, చెక్‌పోస్టులు, జిన్నింగ్ మిల్లులు, రైస్‌మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. వీటితో పాటు 14 రైతుబజార్లు, 1,212 దుకాణాల ద్వారా ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని 17 జిల్లాలు, వాటి పరిధిలో ఉన్న 110 మార్కెట్లు వరంగల్ రీజినల్ పరిధిలోకి వస్తాయన్నారు. రీజియన్ పరిధిలో 233 జిన్నింగ్ మిల్లులు ఉండగా పత్తి కొనుగోళ్ల కోసం 205 మిల్లులను గుర్తించామని వివరించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి ఎండీ ఫసియొద్దీన్, చౌటుప్పల్ మార్కెట్ ప్రత్యేకాధికారి పద్మావతి, కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నిధుల్లేవు.. నిర్వహణ ఎలా?

- గ్రామ పంచాయతీల్లో పేరుకుపోతున్న సమస్యలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆరు నెలలుగా నిలిచిన నిధులు
- పన్నుల వసూళ్లూ అంతంతమాత్రమే..
- చిన్న పనులు కూడా చేపట్టలేని దుస్థితి
- కార్యదర్శులకు భారంగా మారిన పంచాయతీల నిర్వహణ



పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు లేకపోవడంతో రామన్నపేటలో రోడ్డుపై పారుతున్న మురుగు

రామన్నపేట : గ్రామ పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆరు నెలలుగా నిధులు రాకపోవడం, పన్నుల వసూళ్లు కూడా లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కాక పాలన అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య తీర్చడం, వీధి దీపాలు వేయడం వంటి చిన్నచిన్న పనులు కూడా చేపట్టలేని దుస్థితి నెలకొంది. ఐదు నెలలుగా సిబ్బందికి వేతనాలు సైతం చెల్లించడం లేదు. నిధులను సర్దుబాటు చేయడానికి కార్యదర్శులు తంటాలు పడుతున్నారు.

కేంద్ర, రాష్ట్రాలిచ్చే నిధులే ప్రధాన ఆర్థిక వనరులు

కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్టేట్ ఫైనాన్స్ నిధులు గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆర్థిక వనరులు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఒక వ్యక్తికి ఏడాదికి రూ.1,600 చొప్పున నాలుగు విడతలుగా నిధులు విడుదల చేస్తాయి. వాటిలో 85శాతం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా, 10 శాతం మండల పరిషత్‌లకు, 5 శాతం జిల్లా పరిషత్‌లకు కేటాయిస్తాయి. ఆర్థిక సంఘం నిధులను పారిశుద్ధ్యం మెరుగుపరచడం, మురుగు కాలువల నిర్మాణం, మంచినీటి సరఫరా, వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ, ట్రాక్టర్ల నెలవారీ కిస్తుల చెల్లింపులు తదితర అవసరాలకు ఉపయోగించాలి. పది శాతం నిధులను కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాల చెల్లింపు, ఫర్నీచర్ కొనుగోలుకు ఉపయోగించుకోవచ్చు. స్టేట్ ఫైనాన్స్ నిధులను సిబ్బందికి వేతనాల చెల్లింపు, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర అవసరాలకు ఉపయోగించుకునే వెసులుబాటు కలదు.

ఆరునెలలుగా ఏ నిధులూ లేవు

జిల్లాలో 428 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చివరిసారిగా గత మార్చి 18వ తేదీన 15వ ఆర్థిక సంఘం నిధులు, 2023 మార్చి 29,30 తేదీల్లో ఎస్‌ఎఫ్‌సీ నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. గ్రామ పంచాయతీలకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. ఆరు నెలలుగా ఆర్థిక సంఘం నిధులు, ఏడాదిన్నర కాలంగా స్టేట్ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చెత్తసేకరణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ఈఎంఐలు, విద్యుత్ బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. ట్రాక్టర్లకు పెట్రోల్ బంకుల్లో అరువుకు డీజిల్ పోయిస్తున్నారు. వీధి దీపాలకు సంబంధించిన సామగ్రిని ఉద్దెరకు కొనుగోలు చేయవలసి వస్తుంది. తాగునీటి మోటార్ల మరమ్మతుల కోసం పంచాయతీ కార్యదర్శులు చేతి నుంచి ఖర్చు చేస్తున్నారు. సిబ్బందికి మూడు నుంచి 5 నెలల వేతనాలు నిలిచిపోయాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేకపోతున్నారు. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్ను, నల్లా బిల్లులు వసూలు చేసి ట్రాక్టర్లలో డీజిల్ పోయించడం, శానిటేషన్ సామగ్రి కొనుగోలు చేస్తున్నారు.

వేతనాలు ఇస్తలేరు



సిరిపురం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్నా. ఐదు నెలల నుంచి జీతాలు వస్తలేవు. ఒకనెల జీతం రాసినప్పటికీ ఇంకా మా చేతికి ఇవ్వలేదు. ఇల్లు గడవడం కష్టంగా ఉన్నది. దుకాణాల్లో ఉద్దెర తెచ్చుకొని పూట గడుపుతున్నాం. నెలనెలా చెల్లించాలి.

–చిప్పలపల్లి శంకరమ్మ, పంచాయతీ కార్మికురాలు, సిరిపురం

ఉన్న నిధులనే పొదుపుగా వాడుతున్నాం



నిధుల లేమితో పంచాయతీల నిర్వహణకు ఇబ్బంది తలెత్తుతున్న మాట వాస్తవమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు ఆరు నెలలనుంచి ఆగిపోయాయి.చివరి సారి మార్చి నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వాటినే కార్యదర్శులు పొదుపుగా వాడుతున్నారు. ఉన్నంతలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

–సునంద, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

కుక్క దాడిలో రెండేళ్ల చిన్నారికి గాయాలు


చిన్నారి రుత్విక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శుక్రవారం కుక్క దాడి చేయడంతో రెండేళ్ల చిన్నారి గాయపడింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల నాగరాజు రెండేళ్ల కూతురు రుత్విక ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధిలో వెళ్తున్న ఓ కుక్క బాలికను వెంటపడి గాయపర్చింది. కుటుంబీకులు, చుట్టుపక్కల వారు చూసి వెంటపడటంతో వెళ్లిపోయింది. వెంటనే చిన్నారిని అర్వపల్లిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

అథ్లెటిక్స్‌లో అనూష ప్రతిభ


పతకం సాధించిన అనూష

ఆత్మకూరు (ఎస్) : మండల కేంద్రానికి చెందిన మేడి అనూష అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ కనబరిచింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అండర్ బాలికల – 16 అథ్లెటిక్స్ పోటీల్లో 60 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం అనూష హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా ఈనెల 19 20 21 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న పదో తెలంగాణ రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. అనుష ప్రథమ స్థానం సాధించడం పట్ల మండల వాసులు పలువురు అభినందిస్తున్నారు.

బైక్ దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

కొండమల్లేపల్లి : అంతర్రాష్ట్ర బైక్ దొంగను కొండమల్లేపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి పట్టణంలో ఈనెల 3,4తేదీల్లో ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన రెండు పల్సర్ బైక్‌లు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. కాగా శుక్రవారం ఉదయం పెండ్లిపాకల ఎక్స్‌రోడ్ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల ప్రాంతానికి కోట చిన్న రాజు అలియాస్ రాజును అదుపులోకి తీసుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించిన ఎస్‌ఐ రామ్మూర్తి, క్రైం సిబ్బంది హేమునాయక్, భాస్కర్లను దేవరకొండ డీఎస్పీ, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

రాజాపేట : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దూదివెంకటాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఒంకోల్ల వెంకటయ్య (55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య సుశీల చికిత్స నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. వెంకటయ్య చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉపేందర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరు డైరెక్టర్ పదవులు కాంగ్రెస్ ఖాతాలోకే..


విజయం సాధించిన అనంతరం పాల సొసైటీ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్లఅయిలయ్య. చిత్రంలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, డైరెక్టర్లు

- మదర్ డెయిరీలో అధికార పార్టీ మద్దతుదారుల విజయఢంకా
- ఆరు డైరెక్టర్ పదవులకు ఎన్నిక జరిగితే.. ఆరింటిలోనూ వారే గెలుపు
- ఫలించని బీఆర్‌ఎస్ ప్రయత్నాలు
- నేడు చైర్మన్‌ను ఎన్నుకోనున్న డైరెక్టర్లు

సాక్షి, యాదాద్రి : నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి లిమిటెడ్ మదర్ డెయిరీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకే పట్టంకట్టారు. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ల పదవులకు శుక్రవారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. గెలుపు కోసం తుది వరకు పోరాడిన బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పలేదు. ఆ పార్టీ బలపర్చిన నలుగురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఓటింగ్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో జరిగింది. 297 మంది పాల సొసైటీ చైర్మన్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాలుగు డైరెక్టర్లకు 8 మంది, రంగారెడ్డి జిల్లాలోని రెండు డైరెక్టర్ల స్థానాలకు నలుగురు పోటీపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దిగిన నలుగురు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి (229 ఓట్లు), పుప్పాల నర్సింహులు (181 ఓట్లు), బత్తుల నరేందర్‌రెడ్డి (177 ఓట్లు), కల్లెపల్లి శ్రీశైలం (222 ఓట్లు) గెలుపొందగా, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ నుంచే పోటీ చేసిన నలుగురిలో అగ్రాల నర్సింహారెడ్డి(242 ఓట్లు), మండలి జంగయ్య (237 ఓట్లు) గెలుపొందారు.

పెరిగిన కాంగ్రెస్ బలం

మదర్ డెయిరీలో మొత్తం 15 డైరెక్టర్ పదవులు ఉన్నాయి. అందులో ఆరు స్థానాలకు పదవీకాలం ముగియడంతో ఎన్నిక నిర్వహించారు. ఈ ఆరు పదవులను కాంగ్రెస్ మద్దతుదారులు గెలుచుకున్నారు. పదవిలో కొనసాగుతున్న 9 మంది డైరెక్టర్లలో కూడా ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ బలం 12కు చేరింది.

నేడు చైర్మన్ ఎన్నిక

మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. 15 మంది పాలకవర్గ సభ్యులతో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు పదవీ కాలాన్ని లాటరీ పద్ధతిలో నిర్ణయిస్తారు. ఇందులో ముగ్గురు డైరెక్టర్లకు నాలుగు సంవత్సరాలు, మిగతా ముగ్గురికి ఐదు సంవత్సరాలు పదవీకాలంగా నిర్ణయిస్తారు. అనంతరం శనివారంతో పదవీకాలం ముగియనున్న చైర్మన్ స్థానంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. మెజార్టీ సభ్యులు బలపర్చిన అభ్యర్థి చైర్మన్‌గా ఎన్నిక అవుతారు. కాంగ్రెస్ మద్దతుదారులు ఎక్కువ ఉన్నందున ఆ పార్టీకి చెందిన డైరెక్టరే చైర్మన్ అవుతారు.

చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

మదర్ డెయిరీ నూతన చైర్మన్‌గా యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని నిర్ణయించినట్లు ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య వెల్లడించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సీల్డ్ కవర్ చైర్మన్ ఎంపిక ఉండదన్నారు. పార్టీలో అందరి సమక్షంలో ముందుగా చైర్మన్ అభ్యర్థిగా గుడిపాటి పేరును ప్రతిపాదించినట్లు చెప్పారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను డైరెక్టర్లుగా గెలిపించిన పాల సొసైటీ చైర్మన్లకు రుణపడి ఉంటామని అయిలయ్య అన్నారు.

వేధింపులు తట్టుకోలేకనే హత్య

- కొడుకును హత్య చేసిన తండ్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట రూరల్ : తాగుడుకు బానిసై గ్రామస్తులను, కుటుంబ సభ్యులను వేధిస్తున్న కొడుకును కన్నతండ్రే కడతేర్చాడు. ఈ కేసు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి శుక్రవారం సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని బాపూజీతండాకు చెందిన బాణోతు పంతులుకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పంతులు వారందరి పెళ్లిళ్లు చేశాడు. పంతులు పెద్ద కొడుకు బాణోతు కిరణ్(37) ఏంఏ బీఈడీ చదువుకొని ఇంటి దగ్గరే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కిరణ్ ఇటీవల మద్యానికి బానిసై మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులతో తరచూ గొడవ పడుతుండేవాడు. తన ఇంటి నుంచి వెళ్లిపోవాలని తండ్రిని పలుమార్లు భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఈనెల 11న కిరణ్ తల్లి రాంకోటితండాలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. భార్య సౌందర్య కూడా తన సోదరుడి ఇంటికి సూర్యాపేటకు వెళ్లింది. సోదరుడు శ్రీనుకు జ్వరం రావడంతో నూతనకల్‌కు దవాఖానకు వెళ్లాడు. అయితే రాత్రి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఇదే అదునుగా భావించి తండ్రిని మరింత బెదిరింపులకు గురిచేస్తూ కొట్టడం మొదలుపెట్టాడు. దీంతో వేధింపులకు విసిగిన తండ్రి పంతులు ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొని కొడుకు కిరణ్ మొఖం, గదముపై బలంగా కొట్టాడు. దీంతో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని బాపూజీతండాలోని నివాసంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు, సిబ్బంది ఉన్నారు.

భవనం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని గీతిక

మద్దిరాల : పాఠశాల భవనం పైనుంచి పడి ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బీసు గీతిక స్థానిక గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. బీసు గీతిక శుక్రవారం తెల్లవారుజామున పాఠశాలలోని రెండో అంతస్తు నుంచి కిందపడి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచడంతో పలు అనుమానాలకు దారిస్తుంది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాల సిబ్బంది చేసిన ఒత్తిడి కారణంగానే మా కుమార్తె భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిందని, ఈ ప్రమాదంలో కాలు విరిగిందన్నారు. ఇదే విషయమై కేజీబీవీ ఎస్ఓ తేజశ్రీని వివరణ కోరగా.. విద్యార్థిని వాష్ చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిందని దీంతో ఆమె కాలి మడమలో దెబ్బతగిలిందని అన్నారు. వెంటనే విద్యార్థిని సూర్యాపేట ఏరియాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి ఆమె తల్లిదండ్రులకు అప్పజెప్పాని వెల్లడించారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మోతె : పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో రైతులు సాగుచేసిన డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి, మిరప పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగుచేసిన వరిలో బ్యాక్టీరియాతో ఆకు ఎండె తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక వర్షాలు కురవడంతో పత్తి పంటలో తేమ ఉండడంతో ఎరువులను వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదర్శ, సంతోష్, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన వెంకటేశ్వర్లు


బాలసాయిగూడెం స్టేజి వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

పెద్దవూర : నల్లగొండ జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాలలో శుక్రవారం నలుగురు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి(సాగర్) మండలంలోని నెల్లికల్లు గ్రామానికి చెందిన చెన్నబోయిన వెంకటేశ్వర్లు(35) తన భార్య ప్రేమలతతో కలిసి హైదరాబాద్‌లో చదువుకుంటున్న తమ పిల్లలను చూసిరావడానికి మంగళవారం వేకువజామున తమ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. నెల్లికల్లు గ్రామం నుంచి బైక్‌పై వెళ్లి పెద్దవూర మండలం తుమ్మచెట్టు స్టేజీ వద్ద తన అత్తగారి ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని ఉంచి తన అత్తను సైతం తమవెంట తీసుకెళ్లాలని అనుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున గ్రామం నుంచి బైక్‌పై భార్యాభర్తలు బయలుదేరి మండలంలోని బెట్టెలతండా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న మహేంద్ర థార్ వాహనం రోడ్డు ఎడమ వైపు నుంచి పూర్తిగా కుడివైపుకు వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టి 200మీటర్ల దూరంలో ఆగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్యాభర్తలు వెంకటేశ్వర్లు, ప్రేమలతలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఇద్దరిని హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భర్త వెంకటేశ్వర్లు మృతి చెందగా, భార్య ప్రేమలత తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది. మృతుడు చెన్నబోయిన వెంకటేశ్వర్లు పెద్దవూర మండలంలోని పర్వేదుల సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం)గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.వీరబాబు తెలిపారు.

ట్రాక్టర్‌ను లారీ ఢీకొని మహిళ దుర్మరణం

కనగల్ : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన మండలం పరిధిలోని బాలసాయిగూడెం స్టేజి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మండలం పులిమామిడి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరికుంటకాల్వకు చెందిన గోగు లింగమ్మ (69) అదే గ్రామానికి చెందిన కన్నెబోయిన కొండల్ ట్రాక్టర్‌లో వడ్లు పట్టించేందుకు శేరిలింగోటం స్టేజి సమీపంలో ఉన్న రైస్‌మిల్లుకు వచ్చింది. బియ్యం పట్టించుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాలీ రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో కుర్చున్న లింగమ్మకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందగా డ్రైవర్ కొండల్ తీవ్రంగా గాయపడ్డాడు. కొండల్‌ను స్థానికులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ధనుంజయ్య

పెద్దఅడిశర్లపల్లి : ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన బూరుగు ధానయ్య(59), దేరవోనితండాకు చెందిన ఇస్లావత్ పారు(55) మండలంలోని చిల్కమర్రి వద్ద గల కాటన్‌మిల్లులో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారు రోజు మాదిరిగానే కూలి పనిముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని చిలకమర్రి స్టేజి సమీపంలోకి రాగానే కోదాడ –జడ్చర్ల జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ధానయ్య, పారులకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐ ధనుంజయ్య, ఎస్ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు పారు కుమారుడు మంగ్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్ : అక్రమంగా గోవులను తరలిస్తున్న ఓ డీసీఎం వాహనాన్ని శుక్రవారం మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం నుంచి హైదరాబాద్ కబేళాకు అక్రమంగా 23గోవులను డీసీఎం వాహనంలో తరలిస్తుండగా టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా గోవులను పట్టుకున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఈ మేరకు డీసీఎం డ్రైవర్ అఖిల్(35), విజయనగరం జిల్లా జామి మండలం లొట్లపల్లి గ్రామానికి చెందిన సిగడ రమణ(32)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న గోవులను జియాగూడలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.


పట్టుబడిన డీసీఎం వాహనం

ఇంటింటా సౌర వెలుగులు

- 'సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ' పేరుతో కొత్త పథకానికి కేంద్రం శ్రీకారం
- నివాస గృహాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం
- స్వయంగా విద్యుత్ ఉత్పత్తితోపాటు వినియోగానికి అవకాశం
- దరఖాస్తుదారులకు అందనున్న సబ్సిడీ


నల్లగొండ పట్టణంలోని తిరుమలనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

రామగిరి(నల్లగొండ): పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా నివాస గృహాలపైనే సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసి సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతోపాటు దాన్ని ఇంటి అవసరాలకు ఉపయోగించేలా ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకానికి శ్రీకారం చుట్టింది.2024 ఫిబ్రవరి 29న ఈ పథకాన్ని అమలు చేయాలని ఆమోదించింది. ఈ పథకాన్ని జాతీయ స్థాయిలో నేషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ (ఎన్‌పీఐఏ), రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (ఎస్ఐఏ) ఆధ్వర్యంలో అమలు చేస్తారు. ఈ పథకం కింద, డిస్కామ్‌లు తమ పరిధిలోని రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి నెట్ మీటర్ల లభ్యత, ఇన్‌స్టాలేషన్, వెండర్ రిజిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, సోలార్‌రైజింగ్ వంటి అంశాలను పరిశీలిస్తున్నాయి.

సబ్సిడీ ఇలా..

ఈ పథకం కింద 2 కేవీ సామర్థ్యం గల సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ఏర్పాటుకు వాస్తవ ధరలో 60శాతం, 2 నుంచి 3 కేవీ సామర్థ్యం మధ్య సిస్టమ్‌లకు అదనపు సిస్టమ్ ఖర్చులో 40శాతం సబ్సిడీని అందిస్తారు. సబ్సిడీని మాత్రం 3 కిలోవాట్ల సామర్థ్యానికి పరిమితం చేశారు. ప్రస్తుత బెంచ్‌మార్క్ ధరల ప్రకారం 2 కేవీ సిస్టమ్‌లకు రూ. 60వేలు, 3 కేవీ లేదా అంత కంటే ఎక్కువ సిస్టమ్‌లకు రూ.78వేల సబ్సిడీ వర్తించనుంది.

అర్హులు ఎవరు.. దరఖాస్తు చేయడమెలా..

దరఖాస్తుదారు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి. సోలార్ ప్యానెళ్లను అమర్చుకోవడానికి అనువైన పైకప్పు ఉన్న ఇంటిని కలిగి ఉండాలి. ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఉండాలి. సౌర ఫలకాల కోసం గృహస్తులు మరే ఇతర సబ్సిడీని పొంది ఉండకూడదు. అర్హులైన వారు ముందుగా, ఆసక్తిగల వినియోగదారు జాతీయ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రాన్ని విద్యుత్ పంపిణీ సంస్థను ఎంచుకోవడం ద్వారా ఇది జరగాలి. నేషనల్ పోర్టల్ తగిన సిస్టమ్ సైజులు, బెనిఫిట్స్ కాలిక్యులేటర్, వెండర్ రేటింగ్ మొదలైన సంబంధిత సమాచారాన్ని అందించడం ద్వారా గృహాలకు సహాయం చేస్తుంది. వినియోగదారులు తాము ఇన్‌స్టాల్ చేసుకోవాలనుకుంటున్న రూఫ్‌టాప్ సోలార్ యూనిట్‌కు వెండర్‌ను ఎంచుకోవచ్చు.

ప్రయోజనం..

సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం నిబంధనల మేరకు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. తమ ఇంటిపైనే ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సొంత వినియోగానికి వాడుకోవచ్చు. మిగులు విద్యుత్‌ను సంబంధిత డిస్కంలకే అమ్ముకుంటూ ఆదాయం కూడా పొందే అవకాశం ఉంది.

3 కిలోవాట్ల వరకు సబ్సిడీ



ఈ పథకం ద్వారా 1 నుంచి 3 కిలోవాట్ వరకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వర్తిస్తుంది. నిరంతర విద్యుత్‌తో పాటు అదనంగా ఆదాయం పొందే అవకాశం కూడా ఉంది. సోలార్ వినియోగం పెంచేందుకు ప్రభుత్వ సంస్థ రెడ్కో కృషి చేస్తోంది. సోలార్ వల్ల కలిగే ఇంధన పొదుపు లాభాలు, ప్రభుత్వ సబ్సిడీపై ప్రచారం చేస్తున్నాం. ఇంటికి నెలకు 0 నుంచి 150 యూనిట్ల వరకు కరెంట్ వాడుకునే వారికి 1, 2 కేవీ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలి. 150 నుంచి 300 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించుకునే వారు 2 నుంచి 3 కేవీ ప్యానళ్లను బిగించుకుంటే సరిపోతుంది.

– ఎం.పాండురంగారావు, రెడ్కో మేనేజర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా

ఈఎంఐ సదుపాయం ఉంది...



సోలార్ విద్యుత్ పెట్టుకోవాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ద్వారా సబ్సిడీతో ఈఎంఐ సదుపాయం కూడా కల్పిస్తోంది. టాటా, ఆదానీ, యూపీఎల్ కంపెనీలకు చెందిన ప్యానెల్స్ బిగిస్తాం. ఒకసారి ఇంటిపై సోలార్ ప్యానళ్లు పెడితే 25 సంవత్సరాల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నల్లగొండ జిల్లాలో సుమారు 15 వరకు గృహాలపై సోలార్ ప్యానళ్లు అమర్చాం. రోజుకు కిలోవాట్‌కు 3 నుంచి 5 యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతుంది.

– పి.అరవింద్‌రెడ్డి, ఆథరైజ్డ్ వెండర్

కరెంటు బిల్లు ఆదా అవుతుంది



మాకు ప్రతినెలాల 4 నుంచి 5 వేల వరకు కరెంట్ బిల్లు వస్తోంది. ఆరు నెలల క్రితం మా ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నాం. అప్పటి నుంచి తాము కరెంట్ ఉత్పత్తి చేయడంతోపాటు సరిపోను వినియోగించుకుంటున్నాం. నెలనెలా కరెంట్ బిల్లు ఆదా అవుతుంది. అంతే కాదు పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

– తీగల సుష్మ, నల్లగొండ

చికిత్స పొందుతూ వ్యక్తి దుర్మరణం

వేములపల్లి : ఈనెల 5న గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. వేములపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మహేష్(26) కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఉత్తెర్ల వెంకన్న మా గుంపుల్లో పనికి రావద్దంటూ బేదిరించడంతో మనస్తాపానికి గురైన మహేష్ ఈనెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి చెల్లెలు తొకల నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ మృతి


లక్ష్మమ్మ (ఫైల్)

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఆమె రెండు, మూడు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ స్వగృహంలోనే కన్నుమూశారు. మామిళ్లగూడెం గ్రామంతో పాటు శివారు కాలనీల నుంచి పోటీ చేసిన మొదటి సారే అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థిపై బీజేపీ కౌన్సిలర్‌గా గెలుపొంది రికార్డు సృష్టించారు. కానీ అనారోగ్యం కారణంగా పదవి కాలం పూర్తి కాకముందే ఆమె మృతి చెందింది. కాగా ఆమె కుమారుడు కంకణాల నాగిరెడ్డి బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. లక్ష్మమ్మ మృతికి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి రామరాజుయాదవ్, పలువురు నాయకులు, వివిధ పార్టీల కౌన్సిలర్లు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి 61,510 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అయితే రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా 16,180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా విద్యుదుత్పాదన ద్వారా 28,988 క్యూసెక్కులతో కలిపి మొత్తం 45,168 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎంఆర్‌పీ వరద కాల్వకు 16,342 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వరద పెరిగితే గేట్లు మరికొన్ని ఎత్తనున్నట్లుగా ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యం


ఎల్లమ్మ (ఫైల్)

తిప్పర్తి : మహిళ అదృశ్యంపైన ఘటనపై మండల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన ఎల్లమ్మ మతిస్థిమితం సరిగ్గా లేనందున ఈనెల 11న అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె కుమారుడు జల్లేల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.